క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని పటేల్‌నగర్, సాయి నగర్, హనుమాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లైఓవర్ దిగువ ప్రాంతం, రైల్వేస్టేషన్ కట్ట, బల్లెంవారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

పెనమలూరు: పెనమలూరు సెక్షన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ (ఆపరేషన్స్) పి.హరిబాబు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పెనమలూరు గ్రామంలో పూర్తిగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. గ్రామస్తులు సహకరించలని కోరారు.

లారీ డ్రైవర్‌పై కేసు

పెనమలూరు: నిర్లక్ష్యంగా లారీ నడిపి కారును ఢీ కొట్టిన లారీ డ్రైవర్‌పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నంకు చెందిన డీవీ సుప్రకాష్ కారులో విజయవాడకు వస్తూ పెనమలూరు సెంటర్‌లో సిగ్నల్ లైట్లు పడటంతో కారు ఆపాడు. ఈ సమయంలో వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ కారును ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న వ్యక్తికి స్వల్పగాయాలు అవగా కారు ధ్వంసమైంది. ఈ ఘటనపై కారు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి గ్రామ సభలు

పెనమలూరు: గ్రామ పంచాయతీల్లో సభలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కుమార్‌బాబు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మండల పరిధిలో ఉన్న ఆరు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాలలో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు పెనమలూరు, పెదపులిపాక గ్రామాలు, 25వ తేదీ గంగూరు, వణుకూరు గ్రామాలు 26వ తేదీన పోరంకి, గోసాల గ్రామ పంచాయతీల్లో సభలు ఉంటాయన్నారు.

పాము కాటుకు గురైన మహిళ

ఉంగుటూరు: పొలంలో వరినాట్లు వేస్తున్న మహిళ పాముకాటుకు గురైన సంఘటన ఉంగుటూరు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మండలంలోని వేమండ గ్రామానికి చెందిన కంటే రాణి పొలంలో వరి నాట్లు వేసేందుకు వెళ్లింది. ఆ సమయంలో ఓ పాము ఆమెను కాటు వేసింది. ఇది గమనించిన మహిళ తోటి వారికి చెప్పడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని ఆమె బంధువులు చెబుతున్నారు.

అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని పూజలు చేశారు. అభయాంజనేయుడికి తమల పాకులతో పూజలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అడుసుమిల్లి వరప్రసాద్, రామ్మోహన రావు సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆయిల్ పామ్ సాగుకు రాయితీ

గన్నవరం రూరల్: మండలంలోని రైతులు ఆయిల్ పామ్ సాగు చేసుకోవాలని ఇన్‌చార్జి మండల హార్టికల్చర్ అధికారి ఇ.హరిచంద్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొక్కలు కొనుగోలుపై 100 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. హెక్టారుకు 143 మొక్కలు, దేశ వాళీ మొక్కలకు రూ.20 వేలు, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే మొక్కలకు రూ.29 వేల రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. తోటల యాజమాన్యానికి మొక్కలు నాటిన సంవత్సరం నుంచి 4 సంవత్సరాల వరకూ హెక్టారుకు ప్రతి సంవత్సరం రూ.5250 ఇస్తుందన్నారు. అంతర పంటల సాగుకు సంవత్సరానికి రూ.5250 చొప్పున 4 సంవత్సరాలకు రూ.21 వేలు రైతుకు అందుతుందన్నారు. ఇతర రాయితీలు పొందేందుకు ఉద్యాన శాఖను సంప్రదించాలన్నారు.

బ్యాగ్ సేద్యం.. సొంత ఇల్లే క్షేత్రం

వృద్ధి చెందుతున్న 'గ్రో బ్యాగ్స్' విధానం

- పసుపుతో సహా కూరగాయలు, అల్లం వంటివి పండించుకునే అవకాశం
- ఇంటి ఆవరణలోనే మట్టి అవసరం లేకుండానే సాగు



గ్రోబ్యాగ్‌లలో పెరుగుతున్న పసుపు మొక్కలు



గ్రో బ్యాగ్‌లలో మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి చందు జోసఫ్ సుందరం

కంకిపాడు: ఉద్యాన పంటల్లో పసుపు సాగు ముఖ్యమైంది. అలాంటి పసుపు పంట సాగును మట్టితో పనిలేకుండా సాగు చేయటం సాధ్యమేనా?. అంటే అవుననే అంటున్నారు చలివేంద్రపాలెం సర్పంచి బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ తరహా సాగును ఇంటి అవసరాలకు పసుపును ఉత్పత్తి చేసుకునేందుకు ఉపక్రమించారు. కేవలం పసుపు పంటతోనే కాకుండా అల్లం, ఇంటికి అవసరమైన కూరగాయలను సైతం ఎలాంటి అవస్థ పడకుండా పెంచుకోవచ్చు అంటున్నారు శివనాగిరెడ్డి.

వివరాల్లోకి వెళితే..

మండలంలోని చలివేంద్రపాలెం గ్రామానికి చెందిన బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి స్వతహాగా రైతు. అయితే సాగు పనులకు దూరంగా ఉంటున్నారు. దీంతో సాగుపై ఉన్న ఆసక్తితో ఇంటినే వ్యవసాయ క్షేత్రంగా మార్చేశారు. ఇప్పటికే ఇంటికి అవసరమైన వివిధ రకాలైన కూరగాయ మొక్కలను ఇంటి పెరట్లో పెంచుతున్నారు. అయితే మట్టితో పని లేకుండా గ్రోబ్యాగులలో వర్మీకంపోస్టు, కోకో పిట్‌తోనే మొక్కలు పెంచే విధానాన్ని ఆన్‌లైన్‌లో వీక్షించారు. దీంతో ఆ దిశగా ఉపక్రమించారు. ఇప్పటికే 25కి పైగా బ్యాగులను కొనుగోలు చేసి అందులో వర్మీకంపోస్టు, కోకో పిట్ నింపారు. నాణ్యమైన పసుపు, అల్లం విత్తనాన్ని సేకరించి ఆ బ్యాగులలో నాటి సంరక్షిస్తున్నారు. అప్పుడే మొక్కలు రావటం, ఆకులు తొడగటం జరుగుతోంది.ఇంటికి అవసరమైన నాణ్యమైన పసుపు, పసుపు కొమ్ములు, అల్లం ఉత్పత్తి చేసేందుకు మట్టి అవసరం లేని విధానం అవలంభిస్తున్నారు.

కూరగాయల సాగు కూడా..

పసుపు, అల్లం మొక్కల ఎదుగుదల ఆశాజనకంగా ఉండటంతో శివనాగిరెడ్డి కూరగాయల సాగు కూడా చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే రైతువారీగా, ఉద్యానశాఖ అందించే మినీ కిట్‌లను సేకరించారు. ఇదే రీతిన గ్రోబ్యాగ్‌లను సమకూర్చుకుని ఇంటికి అవసరమైన అన్ని రకాల కాయగూరలు పండించేందుకు సమాయత్తం అవుతున్నారు. తక్కువ స్థలంలో మట్టి లభ్యత లేని, ఇంటి పెరడు పెద్దగా లేని ప్రాంతాలకు ఈ విధానం అనువని అంటున్నారు.

నాణ్యమైన పంటను తీసుకోవచ్చు



మట్టి లేదనే చింత లేకుండా వర్మీకంపోస్టు, కోకో పిట్ వినియోగించి గ్రోబ్యాగ్‌లలో హైదరాబాద్ కేంద్రంగా ఔత్సాహిక రైతు 70 టన్నులకు పైగా పసుపు ఉత్పత్తి చేయటాన్ని ఆన్‌లైన్‌లో చూశా. గ్రో బ్యాగ్‌లను తెప్పించి పసుపు, అల్లం విత్తనం నాటాను. మొక్కల ఎదుగుదల ఆశాజనకంగా ఉంది. కూరగాయ విత్తనాలు కూడా నాటాలని భావిస్తున్నా. సేంద్రియ విధానంలో ఎరువులు వాడకుండా మొక్కలను పెంచాలని ఈ విధానాన్ని అనుసరిస్తున్నా.

–బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, సర్పంచి, చలివేంద్రపాలెం

ప్రకృతి విధానం మేలు

గ్రో బ్యాగ్‌లలో సాగు ఇంటి అవసరాలకు సమృద్ధిగా సరిపోతుంది. వ్యాపారాత్మకంగానూ వృద్ధి చేసుకోవచ్చు. ప్రకృతి విధానంలో పండించిన పంటకు మంచి డిమాండ్ ఉంది. సేంద్రియ ఎరువులను క్రమం తప్పకుండా వేసుకోవటం ద్వారా మొక్కల ఎదుగుదల, నాణ్యమైన దిగుబడులు సాధించొచ్చు. ఎప్పటికప్పుడు మొక్క ఎదుగుదలను గమనిస్తూ సంరక్షణ చర్యలు తీసుకోవటం ద్వారా సాగు లాభదాయకంగా ఉంటుంది.

–చందు జోసఫ్ సుందరం, ఉద్యానశాఖ అధికారి, కంకిపాడు

చురుగ్గా సమావేశ మందిర నిర్మాణ పనులు

రూ.45 లక్షల అంచనాతో నిర్మాణం



నిర్మాణంలో ఉన్న కంకిపాడు మండల పరిషత్ సమావేశ మందిరం

కంకిపాడు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి సమావేశ మందిరాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు మండల పరిషత్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..

కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ భవనంలోని కింది గదిని సమావేశ మందిరంగా వినియోగిస్తున్నారు. మండల పరిషత్ పరిధిలో నిర్వహించే పాలకవర్గ సమావేశాలు, అనుబంధ విభాగాలైన విద్యాశాఖ, వెలుగు, ఐసీడీఎస్, ఉపాధి హామీ పథకం, ఇతర శాఖలకు చెందిన సిబ్బంది సమీక్షలు నిర్వహించేందుకు సమావేశ మందిరం సరిపోవటం లేదు. టీడీపీ హయాంలో సమావేశ మందిరం నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి పునాదులు వరకూ నిర్మించారు. తరువాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం, అనంతరం అధికారంలోకి వచ్చిన మండల పరిషత్ పాలక వర్గం సమావేశ మందిరం నిర్మాణంపై దృష్టి పెట్టింది. ఇప్పటికే రూ.25 లక్షలు అంచనా వ్యయంతో సమావేశ భవనం నిర్మిస్తున్నారు. భవనం పూర్తి హంగులతో అన్ని వసతులతో నిర్మాణం పూర్తయ్యి అందుబాటులోకి రావాలంటే మరో రూ.20 లక్షలు వరకూ నిధులు అవసరం. ఆ మేరకు మండల పరిషత్ నుంచి నిధులు వెచ్చించి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అధికారులు, మండల పరిషత్ పాలక వర్గం చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి వచ్చింది. మండల పరిషత్ నిధులు ఏ మేరకు కేటాయింపులు చేసేందుకు చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

పెనమలూరు: కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందని పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వెలిశల సుబ్రహ్మణ్యం ఆరోపించారు. ఆయన కానూరులో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏపీ ప్రజలను మరో సారి మోసం చేసిందని, సీఎం చంద్రబాబునాయుడువలన రాష్ట్రానికి ఒరిగేది ఏమీ లేదని తేలిపోయిందన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పులు ఏజెన్సీలతో ఇస్తామని ప్రకటించటం దారుణమన్నారు. చంద్రబాబు కోరిన రూ.లక్ష కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రం పూర్తి చేయాలన్నారు. విభజన హామీలు గత పదేళ్లుగా పరిష్కారం చేయనిది ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వం ఏమి చేస్తుందన్నారు. బీజేపీ ఏపీని దగా చేసిందన్నారు.

అటకెక్కిన పారిశుద్ధ్యం

- రామవరప్పాడులో పూడుకుపోయిన డ్రెయిన్లతో ఇబ్బందులు
- అంతర్గత రహదారుల్లో పేరుకుపోతున్న చెత్త
- ఎస్సీ శ్మశానంలో చెత్తడంపింగ్‌తో అవస్థలు



అంకిత అపార్టుమెంట్ ఏరియా, 60 అడుగుల రోడ్డుపై చెత్త

రామవరప్పాడు: నగరానికి అతి సమీపంలో ఉన్న మేజర్ పంచాయతీ రామవరప్పాడులో పారిశుద్ధ్య సమస్య పట్టి పీడిస్తోంది. గ్రామంలో సుమారు 50 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి సుమారు 90 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. వీరిని గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించే కంటే పంచాయతీ పెద్దలు వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పేరుకపోతున్న చెత్త కుప్పలు..

గ్రామంలో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారుల్లో నిత్యం చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా రాజుల బజారు, బల్లెంవారి వీధి, కొట్టివారి వీధి, అంకిత అపార్టుమెంట్ ఏరియా, కాల్వగట్టు ప్రాంతాల్లో రహదారుల వెంబడే చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని వాసులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. పారిశుద్ధ్య నిర్వహణ కూడా అభివృద్ధి చెందిన ప్రాంతాల వరకే పరిమితం చేస్తున్నారే తప్ప లోపలి ప్రాంతాల్లో పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

ఎస్సీ శ్మశానంలో చెత్త డంపింగ్..

గ్రామంలోని చెత్తనంతటినీ తీసుకొచ్చి బల్లెంవారి వీధిలోని ఎస్సీ శ్మశానంలో డంప్ చేస్తుండటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ శ్మశానం ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటం, దీని పరిసర ప్రాంతాల్లో నివాసాలు ఉండటంతో ఈ ప్రాంతవాసులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. శ్మశానం చుట్టూ చెత్త గుట్టలుగా పేరుకుపోయాయి. ఫలితంగా పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు వృద్ధి చెందుతున్నాయని సమీప ప్రాంతప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త డంప్‌తో శ్మశానంలోకి వెళ్లేందుకు కూడా అవకాశం లేకపోవడంతో రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. ఈ ఎస్సీ శ్మశానాన్ని ఇటు రామవరప్పాడు, అటు ప్రసాదంపాడు గ్రామస్తులు వినియోగించుకుంటున్నారు.

కదలని మురుగు..

గ్రామంలోని పలు అంతర్గత రహదారుల వెంట డ్రెయిన్లలలో మురుగు పారుదల లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. గ్రామంలోని జెడ్పీ పాఠశాల ప్రాంతంలో డ్రెయినేజీలు పూడుకతీతకు నోచుకోకపోవడంతో పాఠశాల ప్రాంగణం చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతోంది. రాజుల బజారు చివర ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై మోకాలి లోతు వరకు నీరు చేరుకున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని, డ్రెయిన్లు అభివృద్ధి పరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులను వాడాలి



నున్న(విజయవాడరూరల్): సేంద్రియ ఎరువులతో నాణ్యమైన విత్తనాలను తయారుచేసుకుంటే జన్యుపరమైన లోపాలుండవని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి బి.సత్యవతి అన్నారు. నున్న గ్రామంలో గ్రామీణ విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జన్యుస్వచ్ఛతను బట్టి విత్తనములోని తరాలు శ్రేష్టంగా ఉంటాయన్నారు. నాణ్యమైన విత్తనాలతో పంటలను సాగు చేస్తే నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను పొందవచ్చని తెలిపారు. బయటకొన్న విత్తనాలు కల్తీతో ఉంటాయి కాబట్టి రైతులే స్వయంగా విత్తనోత్పత్తి తయారు చేసుకోవాల్సి ఉందన్నారు. మండల వ్యవసాయ అధికారి బి.రంగనాథ్‌బాబు, ఏఈఓ సురేష్, వ్యవసాయ సహాయకులు మౌనిక, హిమబిందు, రైతులు యర్కారెడ్డి వెంకటరెడ్డి, గుంటక సుబ్బారెడ్డి, దేవులపల్లి మాధవరావు, కలకోటి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు సకాలంలో పూర్తి చేయండి

కమిషనర్ వెంకటేశ్వరరావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో బకాయి ఉన్న ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన పోరంకిలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సచివాలయాల సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సర్వే చేసి ఇళ్లకు పన్నులు వేశారో లేదో గుర్తించాలన్నారు. పన్నులు ఉన్న ఇళ్ల బకాయి వసూలు చేయాలని తెలిపారు. పన్నులు వేయని ఇళ్లకు వెంటనే పన్నులు వేయాలని ఆదేశించారు. ఇంటి పన్నులు వసూళ్ల చేయటంలో సిబ్బంది నిర్లక్ష్యం చూపరాదన్నారు. ఇప్పటికే పన్నుల బకాయి చాలా ఉందని తెలిపారు. పన్నులు వసూళ్లు చేయగలిగితేనే పాలన సక్రమంగా ఉంటుందన్నారు. అభివృద్ధి పనులు చేయటానికి అవకాశం ఉంటుందని వివరించారు. రానున్న రోజుల్లో పన్నుల వసూళ్ల లక్ష్యం చేరాలని అన్నారు.

టీడీపీ నేతల అత్యుత్సాహం

కాగా మున్సిపాలిటీలో అధికారులు సిబ్బందితో అధికారికంగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్న సమయంలో టీడీపీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. సమీక్ష సమావేశాలతో టీడీపీ నేతలకు సంబంధం లేక పోయినా వారు హాజరై ఉద్యోగులకు ఫోజులు కొట్టడంపై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం మవుతోంది. అభివృద్ధి పనుల్లో నేతలు పాల్గొంటే అభ్యంతరం లేదుకాని ఇలా అంతర్గతంగా జరిగే సమీక్ష సమావేశాల్లో టీడీపీ నేతలు పాల్గొంటే పరిపాలనకు సంబంధించి తమ అభిప్రాయాలు బహిరంగంగా ఎలా చెప్పగలుగుతామని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఆధార్ నమోదు క్యాంపులు ప్రారంభం



కంకిపాడులో ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

కంకిపాడు: ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. తొలి రోజు కంకిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్, పునాదిపాడు, నెప్పల్లి, గొడవర్రు జెడ్పీ హైస్కూళ్లలో ఆధార్ నమోదు చేపట్టారు. ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ కంకిపాడు–1 పరిధిలో బుధవారం కూడా కంకిపాడులో ఆధార్ కేంద్రం పనిచేస్తుందన్నారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తారన్నారు. పునాదిపాడు పరిధిలో బుధవారం జెడ్పీ పాఠశాలలో ఆధార్ కేంద్రం నడుస్తుందన్నారు. 25, 26, 27 తేదీల్లో పునాదిపాడులో శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్‌లో కేంద్రం నడుస్తుందన్నారు. నెప్పల్లి సెక్టార్ పరిధిలో 24న జెడ్పీ పాఠశాలలోనూ, 25, 26, 27న నెప్పల్లి సచివాలయంలోనూ ఆధార్ కేంద్రం నిర్వహిస్తారన్నారు. మద్దూరు సెక్టార్ పరిధిలో 24న గొడవర్రు జెడ్పీ పాఠశాలలోనూ, 25, 26, 27 తేదీల్లో ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయ రహదారిపై మూడు వాహనాలు ఢీ

ఇద్దరికి స్వల్ప గాయాలు



కంటైనర్ లారీ వెనుక ఢీకొన్న కారు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం మూడు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న కంటైనర్ లారీ దుర్గాపురం వద్దకు రాగనే డ్రైవర్ ఒక్కసారిగా సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో కంటైనర్ లారీని వెనుక వచ్చిన ఇన్నోవా కారుతో పాటు టమాటా లోడ్ లారీ ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు, వెనుక భాగాలు పూర్తిగా నుజ్జునుజ్జుకాగా, అందులో ప్రయాణిస్తున్న ఇరువురికి మాత్రం స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాద ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదానికి గురైన మూడు వాహనాలను పక్కకు తప్పించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.